అందరి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

- జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా
- గుండాలపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం



మందుల కిట్లు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, జెడ్పీటీసీ దాసరి కత్తిరేణమ్మ

ఫిరంగిపురం: జగనన్న ఆరోగ్యసురక్ష పేదల పాలిట ఒకవరం వంటిదని ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. మండలంలోని గుండాలపాడు గ్రామ ఎంపీపీ హెచ్‌ఈ పాఠశాలలో నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా ఓపీ కౌంటర్, రక్తపరీక్షలు, మందులు ఇచ్చే ప్రాంతాలను పరిశీలించారు. అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్‌లో పోషకవిలువలతో కూడిన ఆహార పదార్థాలను రుచిచూశారు. ప్రజలకు అందించే సేవల గురించి వైద్యురాలు ఫరీనాబేగంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏరాష్ట్రంలో ఇటువంటి కార్యక్రమం నిర్వహించిన దాఖలాలు లేవని, ప్రతిగ్రామంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి తగినంత మంది సిబ్బందిని కేటాయించి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషిచేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన ప్రణాళికను ఏర్పాటుచేసి నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించేలా కృషిచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పేదలపాలిట పెన్నిధిగా నిలిచి అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా పథకాలు ప్రవేశపెట్టినట్లు చెప్పారు. దేశంలో ఏరాష్ట్రంలో జరగని అభివృద్ధి మనరాష్ట్రంలో జరుగుతున్నట్లు తెలిపారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో ఏనాడు ప్రజల కష్టాలు పట్టించుకోలేదని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం వైఎస్సార్ కంటివెలుగు ద్వారా పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, చిట్టా బాపూజీ రెడ్డి, సర్పంచ్ కె.పెదబాబు., ఉపసర్పంచ్ కె.దాసయ్య, పాలపాటి రఘు, షేక్ సైదా, కె.వసంత రావు, ఎండీ యాకోబు, ఎ.కృష్ణమూర్తి, చేవూరి రామమోహన్‌రెడ్డి, తహసీల్దార్ పద్మనాభుడు, ఈఓపీఆర్డీ నిర్మలాలక్ష్మీకుమారి, కార్యదర్శి లక్ష్మీశారద, వైద్యులు ఫరీనాబేగం, మేఘన, భీమానాయక్, సీహెచ్‌ఓ వెంకటలక్ష్మి, పీహెచ్‌ఎన్ గాయత్రీదేవి, హెచ్‌వీ నూర్ ఖాజాబీ, హెచ్‌ఎస్ అబ్దుల్ రెహమాన్, ఆరోగ్యసిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



పెనుమాకలో మహానేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



గుండాలపాడులో వైద్యసేవలు అందిస్తున్న వైద్యాధికారి

ఆరోగ్య సురక్షలో ప్రతిఒక్కరికీ వైద్యం..

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ వైద్యశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వాడవాడలా నిర్వహిస్తున్నామని, దానిలో భాగంగా మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పెనుమాకలో రెండవరోజు సోమవారం కూడా వైద్యపరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేస్తున్నట్లు డాక్టర్ రాజేష్ అన్నారు. పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యపరీక్షలు చేయించుకునేందుకు ప్రజలు భారీఎత్తున విచ్చేశారని ఆయన తెలియజేశారు. వచ్చిన ప్రతిఒక్కరికీ వారు చెప్పిన ఆరోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహించడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా అన్నది నలుగురు డాక్టర్ల బృందం విడివిడిగా పేషెంట్లతో మాట్లాడి, అవసరమైతే సంబంధిత డాక్టర్ల సిఫార్సు మేరకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పెనుమాకలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో 40 సంవత్సరాల వయస్సు దాటిన ఎక్కువమంది సందర్శించారని, ఎక్కువగా మోకాళ్ల నొప్పులు, షుగర్, బీపీ, తలనొప్పి, సాధారణ జ్వరాలు ఉన్నవారు వైద్యపరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి కూడా పరీక్షలు నిర్వహించామని, ఆ పరీక్షల్లో ఒకరికి గుండె కొట్టుకోవడంలో తేడా ఉండడంతో ఎన్ఆర్ఐ ఆసుపత్రికి సిఫార్సు చేశామని, 40 సంవత్సరాలు దాటిన కొంతమంది మహిళలలోనూ, పురుషుల్లోను కంటికి సంబంధించిన శస్త్రచికిత్స చేయాల్సి ఉండడంతో ఎన్ఆర్ఐ, శంకర ఐ హాస్పిటల్‌కు పంపిస్తున్నామని, వారందరికీ అక్కడ ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైతే శస్త్రచికిత్స కూడా చేస్తారని ఆయన తెలిపారు. తొలుత దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డ్వాక్రా మహిళలు సైతం తమ సేవలను అందించారు. ఐసీడీఎస్ సిబ్బంది పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ముందుగానే కొంతమందికి కంటిపరీక్షలు నిర్వహించడంతో వారికి ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు. డాక్టర్ రమేష్, డాక్టర్ నరేంద్రబాబు, డాక్టర్ ఎస్‌కే మదీనా, డాక్టర్ టి.సాయిప్రతిమ, వైఎస్సార్ సీపీ పెనుమాక కన్వీనర్ దామేష్ రెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ నాయకులు బొక్క ప్రసన్న, పులి భుజంగరావు, బషీర్, సుభాని, తమ్మా శ్రీనివాస్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీసు సిబ్బంది కొవ్వొత్తుల ప్రదర్శన



మంగళగిరి: పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా నగరంలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని అధికారులు కొనియాడారు. బెటాలియన్ కమాండెంట్ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి, అడిషనల్ కమాండెంట్ ఈఎస్ సాయిప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



మేడికొండూరు: మండల పరిధిలోని గ్రామాల్లోని దేవాలయాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మేడికొండూరు సీఐ వాసు అన్నారు. మండల పరిధిలోని మేడికొండూరు పోలీసు స్టేషన్‌లో సోమవారం మండలంలోని దేవాలయాల ధర్మకర్తలు, ఎండోమెంట్ అధికారులతో మాట్లాడారు. ప్రతి దేవాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దేవాలయాల్లో చోరీలు జరుగుతున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలో అయ్యప్పమాల దారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బాబు గురుస్వామి సోమవారం తెలిపారు. గత నాలుగు రోజులుగా అయ్యప్ప మాలదారులకు మధ్యాహ్నం చద్దిని ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజు 800 మంది వరకు మాలధారులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. మకరసంక్రాంతి వరకు అన్నదానం నిర్వహిస్తామని చెప్పారు.

బైక్ ఢీకొని వృద్ధురాలు మృతి

తాడికొండ: అతివేగంగా వస్తున్న బైక్ వృద్ధురాలిని ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందిన ఘటన తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మాదాసు ఏసురత్తమ్మ (74) ఆదివారం రాత్రి చర్చి నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో ప్రధాన రహదారి దాటుతుండగా అమరావతి నుంచి గుంటూరు వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే ప్రాణాలొదిలింది. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

క్షయ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ



తెనాలిఅర్బన్: క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్ పేర్కొన్నారు. ఎస్‌బీఐ సహకారంతో పట్టణంలోని క్షయ బాధితులకు సోమవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ పి.రవికుమార్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జంగం శ్యామ్, ఆరోగ్య విస్తరణాధికారి అందే బాల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విజయవాడ-చెన్నై రైలు మార్గంలో వలివేరు గేటు, చుండూరు స్టేషన్ల మధ్య నడిగడ్డపాలెం రైల్వే గేటు సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు సోమవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. మృతుడి కుడి చేతిపై 'రమణమ్మ' అని పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. రైలు నుంచి జారి పడటంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పత్తి రైతుకు మద్దతు ధర సీసీఐతో సాధ్యం



ఫిరంగిపురం: ప్రభుత్వం ప్రత్తిరైతులకు ప్రకటించిన మద్దతు ధరను రైతులు వినియోగించుకోవాలని రేపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి పి.శ్రీకాంత్ అన్నారు. రేపూడి వ్యవసాయ మార్కెట్ తరపున పేరేచర్ల సమీపంలోని శ్రీవిజయవెంకటేశ్వర కాటన్ మిల్లులో మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల రైతుల కోసం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే ఉద్దేశంతో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. నాణ్యమైన ఆరుదల పత్తి క్వింటాకు రూ.7,020, పొట్టి గింజ పత్తికి రూ. 6,620 మద్దతుధరను ప్రకటించినట్లు చెప్పారు. ప్రత్తి రైతులు తమ గ్రామాల్లోని రైతు భరోసాకేంద్రాల్లో జిరాక్స్ పత్రాలు అందజేసి రిజిస్ట్రేషన్ చేయించుకొని రసీదు పొందిన తరువాత జిన్నింగ్ మిల్లులో అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీఐ బయ్యర్ ఉమామహేశ్వరరావు, సూపర్‌వైజర్ చంద్రశేఖర్, మిల్లు యజమాని ఎం.రంగారావు, రైతులు పాల్గొన్నారు.

మూడు లారీలు సీజ్

తెనాలిరూరల్: అనుమతులు లేకుండా ఇసుక లోడుతో వెళ్తున్న లారీలను ఎస్ఈబీ అధికారులు సీజ్ చేశారు. కొల్లిపరలో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం తన సిబ్బందితో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. మూడు లారీలు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండడాన్ని గుర్తించారు. వాటిని సీజ్ చేసి, కొల్లిపర పోలీసులకు అప్పగించారు.

బాధితులకు ఆపన్నహస్తం సీఎంఆర్ఎఫ్

- బాపట్ల ఎంపీ నందిగం సురేష్
- బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



బాధిత కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న బాపట్ల ఎంపీ నందిగం సురేష్

ఉద్దండరాయునిపాలెం(తాడికొండ): ఆపదలో ఉన్న పేదలకు వరంగా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఆపన్న హస్తం అందిస్తుందని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అన్నారు. సోమవారం తుళ్ళూరు మండలం ఉద్దండరాయునిపాలెంలోని తన కార్యాలయంలో బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. పర్చూరు నియోజకవర్గం, చినగంజాం మండలం, కవడవకుదురు గ్రామానికి చెందిన కత్తి సుబ్బయ్య మణిపాల్ ఆసుపత్రిలో థ్రాంబోసిక్ ఆపరేషన్ చేయించుకోగా ఆయనకు రూ.5.50 లక్షల ఖర్చయింది. ఆర్థిక స్థోమత లేని ఆ కుటుంబం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.3.50 లక్షల ఆర్థిక సాయం అందింది. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం అన్నంగి గ్రామానికి చెందిన తేళ్ళ అంజమ్మ అనారోగ్య సమస్యలతో ఒంగోలు లోని సంఘమిత్ర ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకుంది. ఆర్థికసాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ. 55 వేలు ఆర్థిక సాయం అందింది. సోమవారం బాధిత కుటుంబ సభ్యులు కత్తి ఫణి, తేళ్ల మోషెకి బాపట్ల ఎంపీ నందిగం సురేష్ చేతుల మీదుగా చెక్కును అందజేశారు.

తూకంలో తేడాలపై అప్రమత్తంగా ఉండాలి

నెహ్రూనగర్: తూకంలో (కాటా) తేడాల్ని ప్రతి ఒక్కరూ గమనించాలని లీగల్ మెట్రాలజీ డెప్యూటీ కంట్రోలర్ షాలెం రాజు సూచించారు. చుట్టుగుంట రైతు బజార్‌లో సోమవారం ధర్మ కాటా ఏర్పాటు చేసి, తూకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షాలెం రాజు మాట్లాడుతూ కొనుగోలుదారులంతా తూకాలపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. తేడా ఉన్నట్టు గ్రహించినట్లయితే ధర్మ కాటా ద్వారా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆ శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ జి. కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సునీల్ రాజు పాల్గొన్నారు.

15లోగా రేషన్ పంపిణీ చేయాలి

తెనాలిరూరల్: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం మండల పరిధిలోని ఎండీయూలు, రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ కె.రవిబాబు వారికి పలు సూచనలు చేశారు. 1 వ తేదీ నుంచి 15 లోగా రేషన్ పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా జరిగేలా చూడాలని, ఎవరికీ ఇబ్బంది లేకుండా సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు.

కేఎల్‌యూకు 5జీ యూజ్‌కేస్ ల్యాబ్



ధ్రువీకరణ పత్రాన్ని చూపుతున్న కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు



ప్రధాని మోదీ ప్రసంగాన్ని ఆన్‌లైన్ ద్వారా వీక్షిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

- కేటాయించిన కేంద్ర ప్రభుత్వం
- వివరాలు వెల్లడించిన రిజిస్ట్రార్

తాడేపల్లిరూరల్ : భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 5జీ యూజ్‌కేస్ ల్యాబ్‌ను కె.ఎల్.విశ్వవిద్యాలయంలోని ఈసీఈ విభాగానికి కేటాయిస్తూ కీలకమైన ఉత్తర్వులు జారీ చేసిందని ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం. సుమన్ సోమవారం వెల్లడించారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2023 (ఐఎం) డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ ప్రారంభోత్సవం సందర్భంగా తమ యూనివర్సిటీకి 5జీ యూజ్‌కేస్ ల్యాబ్‌ను కేటాయించిందని తెలిపారు. ఈ ల్యాబ్ ద్వారా 5జీ కోర్ నెట్‌వర్క్ ప్లాట్‌ఫాంని ఉపయోగించి తక్కువ సమయంలో వేగంగా పని చేసే కమ్యూనికేషన్ వ్యవస్థను రూపొందించవచ్చునని తెలిపారు. 5జీ యూజ్ కేస్ ల్యాబ్ ప్రారంభించడం ద్వారా యూనివర్సిటీలోని అకడమిక్స్‌ను మెరుగుపరుస్తుందన్నారు. బిగ్‌డేటా అనాలసిస్, అగ్రికల్చర్, ట్రాన్స్‌పోర్ట్, సైబర్ సెక్యూరిటీ వంటి విభాగాలలో నూతన ఆవిష్కరణలతో పాటు పరిశోధకులకు, ఉత్పత్తుల అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు. పరిశోధక విభాగం ప్రిన్సిపల్ డాక్టర్ డి. వెంకట రత్నం మాట్లాడుతూ 5జీ వినియోగ కేస్ ల్యాబ్‌కు భారీ ఉత్పత్తి, అభివృద్ధికి సామర్థ్యం ఉందన్నారు. భారతదేశంలో 6జీని కూడా అభివృద్ధి పరిచే ప్రయత్నాలు, ఆవిష్కరణలు జరుగుతున్నాయని తెలిపారు. కె.ఎల్. యూనివర్సిటీకి 5జీ యూజ్‌కేస్ ల్యాబ్‌ను అందించినందుకు ప్రధాని నరేంద్రమోదీకి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ వైస్ చాన్స్‌లర్లు డాక్టర్ ఎ.వి.ఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, టెలీకమ్యూనికేషన్స్ విభాగాధిపతి దినేష్ పాల్గొన్నారు.

కేఎల్‌యూను సందర్శించిన జర్మనీ వర్సిటీ విద్యార్థులు



జర్మనీ వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులతో రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డాక్టర్ ఎం.కిషోర్‌బాబు

తాడేపల్లిరూరల్: జర్మనీలోని బెర్లిన్ నగరంలో విద్యనభ్యసిస్తున్న అనేక విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు సోమవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీని సందర్శించారు. అంతర్జాతీయ సంబంధాల విభాగం డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు మాట్లాడుతూ థామస్ బెర్గర్ నేతృత్వంలో వచ్చిన ఈ బృందం యూనివర్సిటీలోని వివిధ విభాగాలలో జరుగుతున్న అధ్యయనం, పరిశోధనల గురించి వివరించామని, విద్యార్థుల యాక్టివిటీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సాయి విజయ్‌ను కలసి ఆయా విభాగాలలో జరుగుతున్న అధ్యయనం గురించి అడిగి తెలుసుకున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఇరు దేశాల మధ్య పరస్పరం విద్యార్థుల మార్పిడికి సంబంధించిన ఒక అవగాహన జరిగిందని తెలిపారు. విదేశీ భాషల విభాగ అధ్యక్షుడు డాక్టర్ జమిందారు, వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ.వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అంతర్జాతీయ సంబంధాల డైరెక్టర్ డాక్టర్ విజయ్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీలలో సత్యసాయి విద్యార్థుల ప్రతిభ

అండర్-14, అండర్-17 విభాగాల్లో 9 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ రాయపాటి శ్రీనివాస్

తాడికొండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటి అండర్-14, అండర్-17 విభాగాల్లో 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల డైరెక్టర్ మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమిచ్చి తమ పాఠశాలలో మంచి తర్ఫీదు ఇస్తున్నందున విద్యార్థులు క్రీడల్లో ఉన్నతంగా రాణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను వారికి తర్ఫీదు అందించిన పీఈటీ అనీల్ కుమార్‌ను డైరెక్టర్ రాయపాటి శ్రీనివాస్‌తో పాటు కరస్పాండెంట్ మోహనసాయి కృష్ణ, సీఈఓ అమల, ప్రిన్సిపాల్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎంకు ఘనసన్మానం



హెచ్‌ఎం బాబూరావును ఘనంగా సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లి ఎంపీపీఎస్ (ఎఎ) పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన బాబూరావు మాస్టర్‌ను గ్రామస్తులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. 10 సంవత్సరాల క్రితం కుంచనపల్లి పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా వచ్చిన బాబూరావు స్కూల్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఇంటింటికి తిరిగి చిన్నారులను పాఠశాలకు తీసుకువచ్చి విద్య నేర్పించారు. దీంతో బాబూరావు మాస్టారు బదిలీ అయ్యారని తెలియగానే ఆ గ్రామంలో ప్రస్తుతమున్న విద్యాకమిటీతో పాటు గతంలో చదువుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడేపల్లి ఎంఈఓ-2 దోమ నాగేశ్వరరావు విచ్చేశారు. ఉపాధ్యాయులు వి.డీపలత, జి.శోభాదేవి, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కుంచనపల్లి పేరెంట్స్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌరాణిక నటుడు కోటేశ్వరరావుకు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్‌ను స్వీకరిస్తున్న ఆరాధ్యుల కోటేశ్వరరావు

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల పౌరాణిక నటుడు ఆరాధ్యుల కోటేశ్వరరావు అమెరికాలోని డెలావర్ స్టేట్‌లో గల గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్‌ను స్వీకరించారు. పెర్ఫామింగ్ ఆర్ట్స్ కేటగిరీలో ఆయన ఈ గౌరవానికి ఎంపికైన విషయం తెలిసిందే. ఈ నెల 28న పాండిచ్చేరిలోని కంబన్ కలైరంగమ్ ఆడిటోరియంలో జరిగిన యూనివర్శిటీ స్నాతకోత్సవంలో యూనివర్శిటీ వ్యవస్థాపకుడు/ చైర్మన్ డాక్టర్ పి.మాన్యుయేల్, వైస్ చాన్సలర్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.వెంకటేశన్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. తమిళనాడు ప్రభుత్వ విశ్రాంత ముఖ్య కార్యదర్శి/ ప్రత్యేక కమిషనర్ కె.సంపత్‌కుమార్, ప్రొఫెసర్ జె.రంగనాథన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. కళాకారుడు కోటేశ్వరరావు సోమవారం తెనాలిలో ఈ వివరాలను విలేకరులకు తెలియజేశారు.

సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చుక్క రత్న మన్మోహన్ సూచించారు. పాండురంగ పేటలోని షాదీ ఖానాలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలించారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని చెప్పారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ జనరల్ ఓపీ 69, డెర్మటాలజీ ఓపీ 28, రేడియాలజీ ఓపీ 26, అప్తమాలజీ ఓపీ 68 మందికి ఇక్కడ వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషారాణి, డాక్టర్ షేక్ బీబీజాన్, డాక్టర్ వి మహిత, సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.